క్లుప్తంగా

ఇంటి పన్ను చెల్లింపులో రాయితీ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చి రాయితీ కల్పించనుంది. 2024–25 సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ప్రకటించింది. ఈ అవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించగలరని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి రఘు పేర్కొన్నారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు జాకీర్‌షరీఫ్, మహ్మద్ ఫహీం

షాబాద్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు జాకీర్‌షరీఫ్, మహ్మద్ ఫహీం పేర్కొన్నారు. గురువారం ఎస్ఎస్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఖురేషి అదియాకచుడు (టీఎంఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు, ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు విరివిగా సహేర్, ఇఫ్తార్ విందులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా బొడ్రాయి ప్రతిష్ఠ

షాబాద్: ప్రతి అణువులో దేవుడు ఉండి మంచి మార్గాన్ని చూపిస్తాడని రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలత సతీశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు హనుమాన్ ఆలయంలో కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో భాగంగా కలశస్థాపన, అభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, పుణ్యాహవాచనం, సామూహిక హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నర్సింహులు, సంపత్‌రెడ్డి, బండ కృష్ణ, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధు, మాణిక్యం, ఉపేందర్‌రెడ్డి, శివకుమార్, అల్లవాడ బాలయ్య, రవి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జనజాతరకు తరలిరండి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: తుక్కుగూడలో శనివారం నిర్వహించే కాంగ్రెస్ జనజాతర బహిరంగసభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. జన జాతర సభతో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో నాయకులు, కార్యకర్తలు పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలలో విజయఢంకా మోగించాలని కోరారు. తుక్కుగూడలో జరిగే జనజాతర సభలో ఏఐసీసీ మేనిఫెస్టోను ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె, ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు కాకతప్పదని ఆయన అన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య తదితరులు ఉన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

తలకొండపల్లి: యాసంగిలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని ఏఓ రాజు ఎరువుల దుకాణాల యజమానులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌నిల్వ తదితర రికార్డులను పరిశీలించారు. యూరియా, డీఏపీ, ఎంఓపీల కొరత లేకుండా అవసరం మేరకు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువు బస్తాలు అందజేయాలని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో ముంజ కొడుతున్న దృశ్యం



ముంజ కొంటున్న వినియోగదారుడు

భలే.. ముంజ!

హుడాకాంప్లెక్స్: ఆరోగ్యమే మహాభాగ్యం. కాబట్టి ప్రతిఒక్కరూ తీసుకునే ఆహారపు అలవాట్లు కూడా సహకరిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. వీటిని పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఇష్టపడతారు. కాబట్టి మార్కెట్‌లో కల్తీలేనివి, స్వచ్ఛమైనవి లభిస్తున్నాయి. ముఖ్యంగా ఇవి వేసవి కాలంలోనే లభిస్తాయి. వీటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు. వేసవి సెలవులకు పల్లెటూర్లకు వెళ్లే వారు తాటి ముంజలు ఖచ్చితంగా తింటారు. అవి పల్లెల్లో ఎక్కువగా లభిస్తాయి. అక్కడి వారికి ముంజలంటే తెలియని వారుండరు. వాటిని ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా లభిస్తున్నాయి. శివారుప్రాంతాలనుంచి తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజలవణాలను సమతుల్యం చేస్తాయి.

తాటి ముంజలతో ప్రయోజనాలు..

- విటమిన్ బీ 7, కే, సాలెబుల్ ఫైబర్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్–ఏ, డీ, జింక్, ఐరన్ ఎక్కువగా లభిస్తాయి.
- వీటిలో నీటిశాతం ఎక్కువ ఉండటం వల్ల వడదెబ్బ తగలకుండా చేస్తాయి.
- శరీర ఉష్ణోగ్రత తగ్గించి చల్లబరుస్తాయి. అంతేకాకుండా డీ హైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి.
- పొటాషియం సమృద్ధిగా ఉండడంతో రక్తపోటు అదుపులో ఉండి, గుండె సంబంధిత వ్యాధులను దరిచేరనియ్యవు. ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయి. ఇవి శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.
- ముంజలను ప్రతీరోజు క్రమం తప్పకుండా తినడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతాయి.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటి, కడుపు ఉబ్బడం, ఉదర సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి.
- ఎండలో, వేడిమితాపానికి వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. చికెన్ ఫాక్స్‌ను నివారించి శరీరంలోని అధిక బరువును తగ్గిస్తాయి.
- ముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూత రాసుకుంటే చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి వేసవిలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది.

వేసవిలో ఎంతో మేలు

- శరీర సమతుల్యతను కాపాడుతాయి
- వడదెబ్బనుంచి రక్షణ
- విరివిగా విటమిన్ బీ, కే లభ్యం



తీసిన తాటి ముంజలు

ఆరోగ్యానికి ఎంతో మేలు...



ముంజలను పొట్టుతో తీసుకుంటే మలబద్దకం తగ్గుతుంది. జీర్ణకోశ సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ తినొచ్చు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– డాక్టర్ ప్రభాకరాచారి, విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు

మహిళా సాధికారతకు కృషి

- కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకుందాం
- భర్త కోసం సంగీతరెడ్డి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో కొండా సంగీతరెడ్డి

బడంగ్‌పేట్: మహిళా సాధికారత కోసం దేశ ప్రధాని నరేంద్రమోడీ అహర్నిషలు కృషి చేస్తున్నారని కమలం గుర్తుకు ఓటేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కొండా సంగీత ఓటర్లను అభ్యర్థించారు. గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, 31వ డివిజన్‌లో బాలాజీనగర్ కాలనీలోని మహిళా సంఘాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతరెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోడీ పాలన మహిళలకు అండగా ఉందని, అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. మహిళల సాధికారతకు ముద్ర రుణాలు, పీఎం విశ్వకర్మ వంటివి తీసుకొచ్చారన్నారు. మహిళలు తామ కాళ్లపై తాము నిలబడేలా మోడీ ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళలు రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లా, చేవేళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో తన భర్త మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీలో ఉన్నారన్నారు. మీ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. చేవేళ్ల అభివృద్ధి జరగాలంటే కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశ్, సరోజ, కావ్య, మహాలక్ష్మీ, స్వప్న, కాలనీ అధ్యక్షుడు శ్రవణ్, సంగీతశర్మ, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

బీజేపీ సీనియర్ నేతలు ప్రతాప్, లచ్చిరెడ్డి

- మంచాలలో కార్యకర్తలతో సమావేశం

మంచాల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొనిపోవాలన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. యువతను, మహిళలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో నిర్వహించే రైతు సత్యాగ్రహ నిరసన దీక్ష, బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భిక్షపతి, లక్ష్మారెడ్డి, ఐలయ్య, రవీందర్‌రెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు జయశ్రీ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలు పార్టీల నాయకులు అన్నారు. మండలంలోని అల్లవాడ అనుబంధ గ్రామమైన జాలగూడ గ్రామంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐలకు చెందిన నాయకులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారికి గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, ఆలయానికి సంబంధించిన ఫొటోలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, సీపీఐ నాయకులు కె.రామస్వామి, మక్బుల్, యాదగిరి, వడ్ల మంజుల, కాంగ్రెస్ నాయకులు పామెన భీంభరత్, శ్రీనివాస్‌గౌడ్, పాండు, డీవీఆర్, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శైలజ, సమత, కృష్ణారెడ్డి, జంగయ్య, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు. గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, రాజు, అమరేందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా నీటి దందా



సామనగర్‌లో బోరు నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకునుంచి ట్యాంకర్లలో సరఫరా

- వేల అడుగుల లోతుకు బోర్ల తవ్వకం
- ఆపై ట్యాంకర్ల ద్వారా నీటి అక్రమ విక్రయం
- 'వాల్టా'కు తూట్లు.. పట్టించుకోని అధికారులు



నీటిని సరఫరా చేసే ప్రైవేట్ ట్యాంకర్లు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ కొందరు యథేచ్ఛగా వేల అడుగుల లోతుకు బోరులు తవ్వుతున్నారు. వాటిలో నీరు పడితే ఒక్కో బోరు నుంచి రోజుకు వంద ట్యాంకర్ల వరకు నీటిని అమ్ముకుంటూ లక్షల రూపాయలు ఆర్జి స్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోపోవడం, పరోక్షంగా అక్రమార్కులకు సహకరించడంతో నీటి వ్యాపారం మూడు బోర్లు...60 ట్యాంకర్లు అన్నట్టుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ఇక్కడికి వలసలు పెరిగాయి. పెరుగుతున్న జనాభాతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో స్థానికులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.
- జలమండలి అధికారులు ప్రజల అవసరాలకు తగ్గట్లుగా నీటిని సరఫరా చేయలేక పోతున్నారు. ఇదే అదునుగా కొందరు నీటి వ్యాపారం కొనసాగిస్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సామనగర్, సాగర్ కాంప్లెక్స్ ప్రాంతాలలో, హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో కొందరు నీటి వ్యాపారులు అక్రమంగా వేల అడుగుల లోతు బోర్లను తవ్వి ఆ నీటిని విక్రయిస్తూ సొమ్ము

వాల్టా చట్టానికి తూట్లు...

వాల్టా చట్టం ప్రకారం 700 అడుగుల లోతు లోపు బోర్లు వేసి సొంత అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలి. అంతకు మించి లోతు బోర్లు తవ్వరాదు. ఈ నిబంధనకు విరుద్ధంగా నీటి వ్యాపారులు 1000 నుంచి 2000 అడుగుల లోతు వరకు బోర్లు వేసి నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. దీంతో పరిసరాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్లకు నీరు అందక ఆ ప్రాంతంలో నివాసం ఉండేవారు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి భూగర్భ జలాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

జన జాతర సభను విజయవంతం చేయండి

- పీసీసీ కార్యదర్శి జానకీరామ్
- విజయమే లక్ష్యంగా 6న సభ

తుక్కుగూడ: తుక్కుగూడలో శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్, జిల్లా నాయకుడు బంటు ధనంజయ్‌లు పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజా సంక్షేమం కోసం ఐదు గ్యారెంటీలను ఈ సభలో ప్రకటించనున్నారు. జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారన్నారు. ఈ సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కందుకూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శనివారం తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించనున్న జన జాతర బహిరంగ సభను విజయవంతం చేసేలా కార్యకర్తలు, శ్రేణులు తరలిరావాలని మండల కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరవుతున్న సభకు భారీ ఎత్తున కందుకూరు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వారు కోరారు. ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మదన్‌పాల్‌రెడ్డి, ఎగిరిశెట్టి నర్సింహా పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 17, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 28, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 18–23, చిక్కుడు 35–50, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35.శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో పేద జంటకు పెళ్లి

చైతన్యపురి: మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో సందీప్, సుమన అనే పేద జంటకు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర సత్యనారాయణ స్వామి ఆలయంలో ఘనంగా వివాహం జరిపించారు. పెళ్లికి అవసరమైన పుస్తెలు, మెట్టెలు, దుస్తులు అందజేయడంతో పాటు ఇరువురి కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పుస్తె, మెట్టెలు చీదర రమేష్, భోజనాల ఖర్చులు పలిగిల్ల బాపురాజు కుమారుడు రమేష్ అందజేశాడని సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ముగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఈటల రాజేందర్ సతీమణి జమున, మహేష్ తిరుమల, తోట రంగయ్య, శిలా కాశీనాథ్, ఎర్రం కృష్ణమూర్తి, రామిని విజయ్, చంద్రమౌళి, యువసేన సభ్యులు సత్యనారాయణ, రాఘవరెడ్డి, రాజన్న, శ్రవణ్, సాయి పాల్గొన్నారు.

శారదానగర్ అభివృద్ధికి చర్యలు

వనస్థలిపురం: శారదానగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల కోరిక మేరకు ఆయన గురువారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో పర్యటించారు.నిర్మాణంలో ఉన్న కాలనీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును ఆయన పరిశీలించారు. సీనియర్ సిటిజెన్స్ కోసం కింది అంతస్తులో వసతులు కల్పించాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, పార్క్ ప్రహరీ ఎత్తును పెంచాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఎన్నికల అనంతరం పనులు చేపడతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. నాయకులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, కాలనీ వాసులు కేఎల్ నర్సింహారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, ఇందిర, అరుణ, శ్రీనివాసరావు, రాజీగౌడ్, హనుమంతరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న సంధ్య, వెంకటేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు వాటర్‌మెన్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి నీటి సమస్యలు రాకుండా ప్రతిరోజు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు వాటర్‌మెన్‌లకు అనుసంధానంగా ఉంటూ తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా నీటి కొరత ఏర్పడే సమస్య ఏమైనా ఉంటే వెంటనే తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకు అందరం కృషి చేసుకుందామన్నారు. పైపులైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

కేశంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని, కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. అందులో భాగంగా గురువారం నిర్వాన్ ఆర్గనైజేషన్ సభ్యుల సహకారంతో విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదో తరగతి తర్వాత విద్యార్థులకు చాలా అవకాశాలు ఉంటాయన్నారు. కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధిస్తే ఉచిత విద్యా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, కృష్ణయ్య, బారీ, సాయి ప్రసాద్, సుజాత, శిరీష, నిర్వాన్ ఆర్గనైజేషన్ సభ్యులు నగేంద్ర, నరేశ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మైనార్టీ నేతలతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. రంజాన్, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యే మైనార్టీ నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. నెలరోజుల పాటు ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలు చేసి అల్లాను ప్రసన్నం చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన జరుపుకోబోయే రంజాన్ సందర్భంగా జమీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వేలాది మంది తరలివస్తుంటారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ప్రార్థనా స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మున్సిపాలిటీ తరపున ప్రార్థనా స్థలాల వద్ద పారిశుద్ధ్యం, మంచి నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, సదర్ ఖాజీ సయ్యద్ మక్తధీర్ అలీ, మన్సూర్ అలీఖాన్, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.